క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ఇరుసుమండలో గ్రామ దేవత మురుగులమ్మ

అంబాజీపేట: గ్రామంలో వేంచేసిన మురుగులమ్మ తల్లి 25వ ఆలయ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారికి వేకువజాము నుంచి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమ పూజలు చేపట్టారు. గ్రామ ఆడపడుచులు అమ్మవారికి ముడుపులు, మొక్కులు, చలివిడి, పానకాలు నైవేద్యాలను చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన చేపట్టారు.

వైభవంగా ముత్యాలమ్మ తీర్థం

పి.గన్నవరం: ముంగండలో వేంచేసిన ముత్యాలమ్మ వారి తీర్థం ఆదివారం వైభవంగా జరిగింది. గ్రామస్తులు, ఆడపడుచులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని, నైవేద్యాలు సమర్పించారు. పరిసర గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అమ్మవార్ని దర్శించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ నాయకులు వివిధ ఏర్పాట్లు చేశారు.

అనారోగ్య బాధితురాలికి రూ.25 వేల సాయం



బాధితురాలికి సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: అనారోగ్యంతో మంచాన పడిన బాధితురాలికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.25 వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు. గ్రామానికి చెందిన సింహాద్రి అనంతలక్ష్మి చాలా రోజులుగా మంచానికే పరిమితమయ్యారు. తుంటి ఎముక సర్జరీ చేయాలని డాక్టర్లు చెప్పారు. ఆరోగ్యశ్రీలో ఆపరేషన్ చేయించుకోవాలని చూస్తున్నారు. అయితే ఆపరేషన్‌కి ముందు మళ్లీ టెస్టులు చేయించుకోమన్నారు. అందుకు డబ్బులు లేక కాశీ అన్నపూర్ణ దేవి సేవా సంస్థ సభ్యులను సహాయం కోరడంతో సభ్యులు చేతుల మీదుగా రూ..25 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.

రెండేళ్ల బాబుకు ఆర్థిక సాయం



ఇమ్మిడివరప్పాడులో రాజేష్ కుటుంబ సభ్యులకు సాయం అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

అంబాజీపేట: ఇమ్మిడివరప్పాడులో సిర్రా ఏడుకొండలు కుమారుడు రెండేళ్ల బాబు సిర్రా రాజేష్ మెదడువాపు వ్యాధితో బాధపడుతుండటంతో కె.పెదపూడికి చెందిన ఈతకోట సత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్థిక సాయాన్ని అందజేశారు. విజయవాడలోని రెయిన్‌బో హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న రాజేష్ వైద్యం నిమిత్తం రూ.12 వేల నగదును అతని కుటుంబ సభ్యులకు అందజేశారు. సాయం అందించిన వారిలో ట్రస్ట్ ఫౌండర్ ఈతకోట నాగరాజు, సబ్ రిజిస్టార్ రాయి రాంబాబు, నవుండ్రు నాగరాజు, నందెపు రమణ, ఈతకోట రాంచరన్, శ్రీనులు ఉన్నారు.

కచ్చా డ్రైన్ సౌకర్యం ఏర్పాటు చేయరూ..



ఉయ్యూరివారి మెరకలో పల్లాలమ్మ ఆలయానికి సమీపంలో ముంపునీటితో రహదారి

సఖినేటిపల్లి: మండల పరిధిలోని ఉయ్యూరివారి మెరక గ్రామంలో పల్లాలమ్మ అమ్మవారి ఆలయానికి సమీపంలో లోతట్టుగా ఉన్న అనుబంధ రహదారిలో వర్షాలకు నిలిచిపోతున్న నీటిని మళ్లించేందుకు ఉపాధిహామీ పథకంలో కచ్చా డ్రైన్ సౌకర్యం ఏర్పాటు స్థానికులు కోరుతున్నారు.

ఏళ్ల తరబడి తీవ్ర అసౌకర్యంగా మారుతున్న ఈ మార్గంలో ముంపునీరు వెళ్లేందుకు ప్రత్యామ్నాయ ఏరాట్లు చేసి ఊరట కలిగించాలని వారు అభ్యర్థిస్తున్నారు. గ్రామంలో నాలుగు రోడ్ల కూడలి నుంచి పైలాన్ సెంటర్ మీదుగా మలికిపురం మండలంలోని ఇతర గ్రామాలకు వెళ్లడానికి ఈ అనుబంధ రహదారి ఎంతో ఉపయోగంగా గ్రామస్తులకు ఉంది. ఈ దారిలో ఇళ్ల మధ్య లోతట్టుగా ఉన్న ఏరియాలోకి చుట్టుపక్కల కురిసిన నీరంతా చేరుతుండడంతో వారికి తలెత్తి ముంపు నీటి సమస్య వల్ల రోజులు తరబడి అవస్థలు తప్పడం లేదు. ప్రధానంగా టూ వీలర్స్‌పై పిల్లాపాపలతో వెళ్లే వారు ఇక్కడ పడుతున్న అవస్థలు వర్ణనాతీతం.

అధిక లోడు.. అనర్థాలు తోడు



ఆలమూరు-మండపేట రహదారిలో ప్రయాణిస్తున్న ఊక లారీ



కొత్తూరు-వెదురుమూడి రోడ్డులో ప్రయాణిస్తున్న భారీ వాహనం

- ఊక లారీల తాకిడితో ట్రాఫిక్ జామ్
- అధికారుల స్పందన అంతంత మాత్రమే
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

ఆలమూరు: వాహనాల రద్దీ, ఇరుకు రోడ్లతో సతమతమవున్న ప్రజానీకానికి భారీ లోడుతో వెళుతున్న ఊక లారీలు అనునిత్యం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయి. ఊక, బూడిద రవాణా చేస్తున్న లారీలకు ఇరువైపుల మీటరు మేర వెడల్పుగాను, ఉబ్బెత్తుగా సరకు నింపడంతో ఎదురుగా వచ్చే వాహనాలు ప్రయాణికులకు కనిపించడం లేదు.

సుదీర్ఘ సమయం ప్రయాణించిన తరువాత ఖాళీ ప్రదేశాల్లో మాత్రమే అధిక లోడుతో వెళుతున్న వాహనాన్ని అధిగమించ వలసిన పరిస్థితి ఏర్పడుతుంది. నిబంధనలకు విరుద్ధంగా అత్యధిక టన్నులతో ప్రతి రోజు ఉదయం వేళల్లో పదుల సంఖ్యలో లారీలు మండపేట వైపు, వెదురుమూడి వైపు ప్రయాణించడం వల్ల వాహనదారులకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుంది. అధిక లోడును నివారించిన వలసిన ఆర్‌టీఓ అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం వల్లే ఇలాంటి పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

పర్యావరణానికి ప్రాధాన్యం ఇవ్వాలి

కాలం చెల్లిన వాహనాలు రోడ్లపై తిరగకుండా కఠిన చర్యలు తీసుకుంటే పర్యావరణాన్ని రక్షించుకోవచ్చనే అభిప్రాయం పర్యావరణవేత్తల నుంచి వ్యక్తమవుతుంది. అధిక లోడు ప్రయాణం నివారిస్తే ప్రమాదాలు తగ్గడంతో పాటు వాహనదారులకు ప్రయాణం సులభతరం అవుతుందని ప్రయాణికులు చెబుతున్నారు. ఊక, బూడిద లారీ యజమానులకు, డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇవ్వాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది. అలాగే జొన్నాడ-మండపేటతో పాటు కొత్తూరు-వెదురుమూడి రోడ్లల్లోని అసంపూర్తిగా ఉన్న బెర్మ్‌లకు మరమ్మతులు చేస్తే మరింత ప్రమాదాలు తగ్గుముఖం చెబుతున్నారు.

భారీ వాహనాల రాకపోకలతో వాహనదారుల పరేషాన్

గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లపై ఊక లారీలు స్వారీ చేయడమే ఇబ్బందికరంగా ఉంటే ఓఎన్‌జీసీకి చెందిన భారీ వాహనాలు అనునిత్యం ఇరుకు రోడ్లపై ప్రయాణించడం వల్ల వాహనదారులకు నరకప్రాయంగా మారింది. ఆలమూరు, కపిలేశ్వరపురం మండలాల్లోని పరిసరాల్లో అనేక ఓఎన్‌జీసీ రిగ్‌లు ఉన్నాయి. వాటికి సంబంధించి మెషీనరీ తరలించే వాహనాలు అధికంగా ఉండటంతో ప్రతి రోజు ప్రజలు నరకం అనుభవిస్తున్నారు. వాహనాలదారులకు సాఫీగా ప్రయాణం జరగకపోవడం ప్రాణసంకటంగా మారింది. ఒక్కోసారి లారీలకు ఏదైనా సాంకేతిక లోపం ఏర్పడితే రోడ్డు మీదనే నిలిచిపోవడం ప్రయాణికులకు శాపంగా పరిణమిస్తుంది. రవాణాశాఖ నిబంధనలను అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

పరిమితికి మించి లోడు వేసుకుని ప్రయాణించే వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే పలుమార్లు డ్రైవర్లకు అధిక లోడు వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించాం. ఊక, బూడిద తరలించే వాహనదారులు తప్పనిసరిగా పట్టాలు ఏర్పాటు చేసుకుని ప్రయాణికులకు అంతరాయం కలగకుండా చూడాలి.

– కె.నాగేశ్వరరావు, ఎంవీఐ, మండపేట

మబ్బే ముసురేసిందిలే..

అంబాజీపేట: గత కొద్ది రోజులుగా ఎండల ప్రభావంతో తీవ్ర ఇబ్బందులు పడిన ప్రజలు రెండు రోజులుగా వరుణుడు కరుణ చూపించి వర్షం కురిపించడంతో అంబాజీపేట మండలం తడిసి ముద్దయింది. ఆదివారం అర్ధరాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం ధాటికి వాతావరణం చల్లబడింది. వేకువ జాము నుంచి వర్షం కురవడంతో మార్కెట్‌కు వచ్చే అరటి వ్యాపారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మబ్బు కాస్తా ముసురేయడంతో ప్రధాన కూడలిలో జనజీవనం స్తంభించింది. ఆదివారం కావడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. వాతావరణం అంతా చల్లగా మారిపోవడంతో ప్రజలంతా ఇళ్ల వద్దే ఉండి కుటుంబ సభ్యులతో ఆహ్లాదంగా గడిపారు. మరో పక్క రైతులు వరి నారుమడులు వేసేవారు కొందరైతే.. మరి కొందరు వరి నాట్లు వేసేందుకు దుక్కి దున్నే పనుల్లో నిమగ్నమయ్యారు.

భారీ వర్షంతో అధ్వానంగా మారిన రోడ్లు

మామిడికుదురు: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షంతో రోడ్లు అధ్వానంగా మారాయి. ఆదివారం ఉదయం నుంచి భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి రోడ్లు దారుణంగా దెబ్బతిన్నాయి. రోడ్లపై భారీగా వర్షం నీరు నిలిచి పోవడంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నగరం, మామిడికుదురు, పాశర్లపూడి 216వ నంబర్ జాతీయ రహదారిపై కూడా వర్షం నీరు నిలిచిపోయింది. దీంతో వేగంగా వెళ్తున్న భారీ వాహనాల స్పీడుకు ఎన్‌హెచ్ పక్కన ఉన్న ఇళ్లలోకి, షాపులోకి వర్షం నీరు వెళ్లి స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్‌హెచ్ దెబ్బతిన్న ప్రాంతాల్లో సంబంధిత అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. మోటార్ సహాయంతో వర్షం నీటిని తోడించి జాతీయ రహదారిపై ఏర్పడిన గోతుల్లో మెటల్ వేసి తాత్కాలిక మరమ్మతులు చేశారు. గ్రామీణ పాంత్రాల్లో పంచాయతీరాజ్ రోడ్లపై కూడా వర్షం నీరు నిలిచిపోయింది. పెదపట్నంలంక, అప్పనపల్లి, బి.దొడ్డవరం, పాశర్లపూడిలంక, లూటుకుర్రు, ఆదుర్రు, మగటపల్లి, గోగన్నమఠం తదితర గ్రామాల్లో రోడ్లు వర్షానికి దెబ్బతిన్నాయి. దీంతో ప్రజలు అవస్థలు పడ్డారు. పాడైపోయిన రోడ్లకు కనీస మరమ్మతులైనా చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేశారు.



అధ్వానంగా మారిన కొర్లగుంట రోడ్డు



వర్షానికి జన జీవనం స్తంభించడంతో నిర్మానుష్యంగా అంబాజీపేట ప్రధాన రహదారి

ముగిసిన మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు

ఆలమూరు: వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సీజనల్ అంటువ్యాధుల్లో ప్రధానమైన మలేరియా వ్యాధి నివారణకు ప్రభుత్వం చేపట్టిన వ్యతిరేక మాసోత్సవాలు ఆదివారం ముగిశాయి. మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల పరిధిలో గత నెల రోజుల నుంచి క్షేత్రస్థాయిలో వైద్యారోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. మలేరియా నివారణపై ఏర్పాటు చేసిన భారీ ర్యాలీల్లో ప్రజలను భాగస్వామ్యం చేశారు. మలేరియా వ్యాధి వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కలిగి ఉండాలని సూచించారు. అలాగే అనుమానిత జ్వర పీడితులకు రక్త పరీక్షలు నిర్వహించి వ్యాధిని నిర్ధారించారు. దానికనుగుణంగా చికిత్సను అందజేసిన మలేరియా వ్యాధి నివారణకు వైద్యారోగ్య సిబ్బంది తమ వంతు కృషి చేశారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలమణి తదితరులు వైద్య సేవలను పర్యవేక్షించారు.



సంధిపూడిలో మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

మలేరియా రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం

జిల్లా వైద్యారోగ్యశాఖ ఆదేశాల మేరకు మలేరియా రహిత సమాజమే లక్ష్యంగా గ్రామస్థాయిలో ఆరోగ్య సిబ్బంది పనిచేశారని వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి, డి.మల్లికార్జున్, డి.సాయికిషోర్ అన్నారు. గత నెల రోజుల నుంచి ఏకధాటిగా మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు నిర్వహించడం పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. పీహెచ్‌సీల పరిధిలో మలేరియా వ్యాధిగ్రస్తులు నమోదు గణనీయంగా తగ్గడం పట్ల వైద్యారోగ్య సిబ్బందిని అభినందించారు.

కళాకారుల పింఛన్ రూ.6 వేలకు పెంచాలి

మామిడికుదురు: కళాకారుల పింఛన్‌ను రూ.6 వేలకు పెంచడంతో పాటు పింఛన్ అర్హత వయస్సును 50 ఏళ్లకు తగ్గించాలని కోనసీమ వృత్తి కళాకారుల సాంస్కృతిక సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మంగం సత్యనారాయణ కోరారు. మామిడికుదురు అంబేడ్కర్ సామాజిక భవనంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కళాకారులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. హెల్త్ కార్డులు అందించి ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాల సాంస్కృతిక ప్రదర్శనలకు అవకాశం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం అందించే గుర్తింపు కార్డుల ద్వారా బస్సు, రైళ్లలో 50 శాతం రాయితీ కల్పించాలని కోరారు. ప్రముఖ కవి గుర్రం ధర్మోజీరావు స్మారక అవార్డు అందుకున్న సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మంగం సత్యనారాయణను కళాకారుల సంఘం తరపున ఘనంగా సన్మానించారు. పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి వాసంశెట్టి శంకరరావు, ఉపాధ్యక్షుడు అడబాల సత్యనారాయణమూర్తి, దూనబోయిన వీరరాఘవులు, సారె రాణి, సరిదే సత్యవతి, కోశాధికారి సరిదే లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సత్యనారాయణ

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

కొత్తపేట: గ్రామ సచివాలయాల సిబ్బంది ద్వారా సామాజిక పింఛన్ పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఎంపీడీఓ కె.వాణి తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండలంలో మొత్తం 28 కేటగిరీలకు చెందిన పింఛనుదారులు 10,599 మంది ఉండగా వారికి ప్రభుత్వం రూ.7,08,74,000 విడుదల చేసినట్టు తెలిపారు. మండలంలోని 10 గ్రామాల్లో 144 మంది సచివాలయాల సిబ్బంది సోమవారం ఉదయం నుంచే లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్ అందజేయనున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 1, 2 తేదీల్లో పింఛన్లు పంపిణీ పూర్తి చేయాలనే లక్ష్యంతో చర్యలు తీసుకున్నామన్నారు. అందువలన పింఛనుదారులందరూ ఇంటి వద్దే ఉండి పింఛను పొందాలని కోరారు.

భగవంతుడి సేవలో తరించాలి

అయినవిల్లి: సర్వం భగవంతుడిదే.. ఆయన సేవలో తరించిన వారికి ముక్తి లభిస్తుందని ప్రభూజీ సుందర శ్రీనివాస్‌దాస్ అన్నారు. ఆదివారం నల్లచెరువులోని అంతర్జాతీయ శ్రీకృష్ణమందిర్‌లో శ్రీకృష్ణుని తత్వం భక్తులకు బోధించారు. శ్రీకృష్ణుని లీలలు సామాన్య మానవులకు అర్థం కావన్నారు. ఆయన తన భక్తులను రక్షిస్తూ ఉంటాడన్నారు. అధిక సంఖ్యలో భక్తులు అంతర్జాతీయ శ్రీకృష్ణ ఆలయాన్ని దర్శించి స్వామికి విశేష పూజలు జరిపారు. అనంతరం స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

వీరేశ్వరునికి లక్ష బిల్వదళ పూజ

అయినవిల్లి: మండలంలోని వీరవల్లిపాలెంలో కొలువైన భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామివారికి వేదపండితుల ఆధ్వర్యంలో ఆదివారం లక్ష బిల్వదళాలతో విశేష పూజలు జరిపారు. ఆలయ అర్చకులు కామేశ్వరశర్మ, వేదపండితులు దీక్షితులు ఆధ్వర్యంలో 11 మంది రుత్వికులు ఈ పూజలు చేశారు. తొలుత స్వామికి ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వాలతో పూజలు జరిపారు. స్వామిని అధిక సంఖ్యలో దర్శించుకుని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఉపాధ్యాయులే దేశ ఉన్నత భవితకు మార్గదర్శకులు

కొత్తపేట: విద్యాలయాల్లో విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడం ద్వారా దేశ ఉన్నత భవిష్యత్‌కు మార్గదర్శకులుగా నిలిచేది ఉపాధ్యాయులేనని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మండలంలోని మోడేకుర్రు ఎంపీపీ స్కూలు హెచ్‌ఎంగా పనిచేసిన మర్రి వీవీ సత్యనారాయణ, వానపల్లి శివారు సంఘంపాలెం ఎంపీపీ యూపీ స్కూలు హెచ్‌ఎంగా పనిచేసిన వాసంశెట్టి వెంకటరమణ ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం మండల విద్యాశాఖ, యూటీఎఫ్, ఎస్‌టీయూ సంయుక్త ఆధ్వర్యంలో పై ఇద్దరు ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణ వీడ్కోలును ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ ఆవరణలోని శ్రీకృష్ణదేవరాయ సభా ప్రాంగణంలో నిర్వహించిన సభకు ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే సత్యానందరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ అన్ని వృత్తుల్లోనూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైందన్నారు. దేశానికి ఉద్యోగులు, ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు, రాజకీయ నాయకులు, చట్టసభల ప్రతినిధులు, రాజ్యాంగ ప్రతినిధులు అందరూ ఒకప్పుడు విద్యార్థులేనని, వారికి విద్య అనే పునాది వేసింది ఉపాధ్యాయులేనని అన్నారు. అటువంటి ఉపాధ్యాయ వృత్తి వారి జీవితానికి ఎంతో సంతృప్తినిస్తుందన్నారు. అనంతరం సత్యనారాయణ, వెంకటరమణ దంపతులను ఎమ్మెల్యే బండారు చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, సర్పంచ్ బూసి జయలక్ష్మి, ఉప సర్పంచ్ కంఠంశెట్టి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దరణాల రామకృష్ణ, యూటీఎఫ్, ఎస్టీయూ మండల శాఖల అధ్యక్షులు కేపీసీహెచ్ సూర్యారావు, బీవీ శేషగిరి, ఆయా సంఘాల జిల్లా, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేటలో రిటైర్డ్ ఉపాధ్యాయులను అభినందిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

భైరవం.. భీకరం..

- బెంబేలెత్తిస్తున్న వీధి కుక్కలు
- సంతాన నియంత్రణ చర్యల్లో అధికారులు విఫలం

అంబాజీపేట: ఎక్కడ చూసినా కుక్కల బెడద తీవ్రంగా ఉంది. కాస్త జనసంచారం తగ్గాక పాదచారులు, వాహన చోదకులను వెంబడిస్తూ గాయాల పాలు చేస్తున్నాయి. ఇటీవల కుక్కలు రెండు రోజుల్లోనే మూడు నియోజకవర్గాల్లో దాదాపు 126 మందిని గాయపర్చడం ఆందోళన కలిగించే విషయం. ప్రభుత్వ వైద్యశాలలకు నిత్యం నాలుగు నుంచి ఆరు మంది వరకు కుక్క కాటు కేసులు వస్తున్నాయని ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు చెబుతున్నారు. గడిచిన రెండు నెలలుగా పి.గన్నవరం, రాజోలు, కొత్తపేట నియోజకవర్గాల్లో సుమారుగా 830 కేసులు నమోదయ్యాయని వైద్యాధికారులు చెబుతున్నారు. కుక్కల నియంత్రణతో పాటు వాటి సంతాన నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. పశువుల పైనా దాడి గ్రామాల్లో స్వైరవిహారం చేస్తున్న కుక్కలు, పశువుల పైన దాడి చేస్తున్నాయి. గేదెలు, కోళ్లు, పంది పిల్లలు పెంపుడు జంతువులపై కుక్కలు తమ ప్రతాపాన్ని చూపిస్తున్నాయని ఉన్నతాధికారులు స్పందించి కుక్కల సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నియంత్రణ కరవు

యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) అంటే జంతువుల కుటుంబ నియంత్రణ చేపట్టడం లేదు.

ఏబీసీ ఏజెన్సీని నియమించి వీధి కుక్కలు, కోతులు, ఇతర జంతువుల నుంచి మనుషులకు హాని కలగకుండా నియంత్రణ చర్యలు శూన్యం. జంతువులకు కుటుంబ నియంత్రణకు చేసే ఏజెన్సీ ఎక్కడా లేదన్న విమర్శలున్నాయి. పశువులకు ముందస్తుగా రేబీస్ వ్యాక్సిన్ వేయించాలి. హోటళ్లు, హాస్టళ్లు, ఫంక్షన్లో మిగిలిన ఆహారాన్ని ఎక్కడ పడితే అక్కడ వేస్తే కుక్కల సంచారం పెరుగుతుంది. అలా పడేయకపోవడం మంచిది.



అంబాజీపేటలో విచ్చలవిడిగా సంచరిస్తున్న కుక్కలు

స్వామివారి సన్నిధిలో పీఠాధిపతి

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో ఆదివారం కేసరపల్లి భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతి స్వామి, లక్ష్మీనృసింహునికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద పీఠాధిపతికి ఆలయ సాంప్రదాయ ప్రకారం ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, అర్చకులు స్వాగతం పలికారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, సూపరింటెండెంట్ పి.విజయ సారథి, సీనియర్ అసిస్టెంట్ ఎం.సత్యకిరణ్ పాల్గొన్నారు.



అంతర్వేది ఆలయంలో పీఠాధిపతితో ఏసీ సత్యనారాయణ, అర్చకులు

మట్టి రోడ్డు కాదు.. తారు రోడ్డు

ఆలమూరు: స్థానిక తహసీల్దార్ కార్యాయలలోని పెద్ద కాలువ వద్ద తారు రోడ్డు పరిస్థితి మట్టి రోడ్డు కంటే దారుణంగా తయారైంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు వర్షపు నీరు బయటకు వెళ్లకుండా రోడ్డు మీదనే ఉండిపోతుంది. రోడ్డుకు ఇరువైపులా ఇటుక బట్టీలు, పొలాలు ఉండటంతో ఆ ప్రదేశమంతా మట్టి పేరుకుపోయింది. రోడ్డు పక్కన బెర్మ్‌లు సక్రమంగా లేకపోవడమే ఈ పరిస్థితికి కారణమని స్థానికులు చెబుతున్నారు. దీంతో స్థానిక కాలిబాట వంతెన మీదుగా ప్రయాణించే వాహనదారులు తరచూ జారిపడి గాయాల పాలవుతున్నారు. దీనిపై పలు ఫిర్యాదులు అందుతున్నా ఆర్అండ్‌బీ శాఖ నిద్రావస్థలో ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఆర్అండ్‌బీ బంగ్లా నుంచి కాలిబాట వంతెన ద్వారం వరకూ ఇదే పరిస్థితి నెలకొనడంతో కపిలేశ్వరపురం, గంగవరం మండలాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం చుక్క పడిందంటే చాలు ఆ రోడ్డు అంతా చిత్తడిగా మారుతుంది. ఇకనైనా అధికారులు సత్వరమే స్పందించి రోడ్డును ప్రక్షాళన చేయాలని, రోడ్డుపై మట్టిని పూర్తిగా తొలగించి యథావిధిగా రాకపోకలు సాగించాలని ప్రజలు కోరుతున్నారు.



ఆలమూరులోని పెద్దకాలువ వద్ద మట్టి రోడ్డు కంటే దారుణంగా తయారైన తారు రోడ్డు

దడ పుట్టిస్తున్న పప్పుల ధరలు

అంబాజీపేట: పప్పుదినుసుల ధరలు మండిపోతున్నాయి. కందిపప్పు ధరలకు రెక్కలు రాగా, శనగపప్పు, మినపపప్పు ఇలా అన్ని పప్పుల రేట్లు మోత మోగిస్తున్నాయి. ఎన్నికల సమయంలో కేంద్రం పప్పుల దిగుమతులపై దిగుమతి సుంకం 15 శాతం ఎత్తేసింది. దీంతో ఆ సమయంలో ధరలు కాస్త తగ్గాయి. ఎన్నికలు ముగియగానే ధరలు మంట పుట్టిస్తున్నాయి. ఏడేళ్ల గరిష్టానికి మార్కెట్‌ల్లో పప్పుల ధరలు చేరాయి. మరో మూడు వారాల్లో కిలో 20 శాతం పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. 2021 నుంచి అపరాల పంటల దిగుబడులు తగ్గాయి. వాతావరణ మార్పుల ఉత్పత్తిపై ప్రభావం చూపడంతో ధరలు పెరుగుతున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. కొన్ని పప్పులను ఆస్ట్రేలియా, కెనడా, రష్యా, టర్కీ, సూడాన్ వంటి దేశాల నుంచి దిగుమతులు చేసుకోవాలి. దిగుమతులు తగ్గించేలా దేశీయ పంటలను ప్రోత్సహించడానికి కేంద్రం దిగుమతి సుంకాలను విధించింది. అయినా వాతావరణ పరిస్థితులు దిగుబడుల్ని దెబ్బతీశాయి. ప్రస్తుతం పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాల్లో పప్పుల ధరలు కిలో కందిపప్పు రూ.180, మినపపప్పు రూ.120, శనగపప్పు రూ.95, పెసరపప్పు రూ.115, వేరుశనగగుళ్ల రూ.130, శనగలు రూ.140, జీడిపప్పు రూ.650 పలుకుతున్నాయి.



అంబాజీపేట మార్కెట్ విక్రయానికి ఉన్న పప్పుదినుసులు